## క్లుప్తంగా

### సీఎంను కలిసిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద



సీఎం రేవంత్‌రెడ్డితో నేరెళ్ల శారద, తదితరులు

రామడుగు: టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదఆంజనేయులుగౌడ్ తన జన్మదినం పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈసందర్భంగా సీఎం జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందించారని తెలిపారు.

### గోపాల్‌రావుపేటలో డీఎల్‌పీవో విచారణ



మాట్లాడుతున్న డీఎల్‌పీవో రాంబాబు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామ పంచాయతీ వద్ద ఉన్న హనుమాన్ ఆలయంతో పాటు మరో రెండు ఆలయాల పునరుద్ధరణకు గ్రామస్తులు, యువజన సంఘాల నాయకులు తీర్మానం చేశారు. దీంతో తమ ఇంటికి ఇబ్బంది కలుగుతుందని మాజీ సర్పంచ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం డీఎల్‌పీవో రాంబాబు గ్రామ పంచాయతీ వద్ద గ్రామస్తులు, యువజన సంఘాల నాయకులు, మాజీ సర్పంచ్ సత్యప్రసన్న సమక్షంలో విచారణ చేపట్టారు. దీనిపై ఇరువర్గాల వివరణ స్వీకరించిన డీఎల్‌పీవో సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తానన్నారు. అలాగే నూతన గ్రామపంచాయతీ నిర్మాణం సమస్యపై విచారణ జరిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, ఏఈ సచిన్ పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### పంటల వివరాలు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్

చొప్పదండి: రైతులు వానాకాలంలో సాగు చేసే పంటల వివరాలను నమోదు చేసుకోవాలని ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. మండలంలోని గుమ్లాపూర్ రైతువేదికలో గురువారం నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో ఏడీఏ రామారావుతో కలిసి మాట్లాడారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, అంతర పంటల సాగు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏవో వంశీకృష్ణ, ఎంపీటీసీ బత్తుల లక్ష్మీనారాయణ, వ్యవసాయ విస్తరణ అధికారి సాయిప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

### అదనపు కట్నం కేసు

జమ్మికుంట: అదనపు కట్న వేధింపులకు పాల్పడిన నలుగురిపై గురువారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగటి రవి తెలిపారు. జమ్మికుంట పట్టణానికి చెందిన నీలిమకు ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన బోగం సంతోష్‌తో ఐదేళ్ల క్రితం పెళ్లైంది. వీరికి ఇద్దరు పిల్లలు, పెళ్లి సమయంలో కట్నకానుకలు అందజేశారు. ఏడాదిగా అదనపు కట్నం తీసుకురావాలని భర్త సంతోష్, అత్తమామ విజయ,రామస్వామి, ఆడబిడ్డ లత వేధిస్తున్నారని నీలిమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

### ప్రజావాణి దరఖాస్తులకు స్పందన కరువు



మాట్లాడుతున్న గూడ కనకయ్య

విద్యానగర్(కరీంనగర్): ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులకు అధికారులు స్పందించడం లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గూడ కనుకయ్య అన్నారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మానకొండూర్, అల్గునూర్ గ్రామాల్లో వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ప్రజావాణిలో పలుమార్లు దరఖాస్తులు ఇచ్చినప్పటికీ అధికారుల నుంచి స్పందన లేదని ఆరోపించారు. కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు జక్కుల రవికుమార్, కనమల్ల కనుకయ్య, కుంచాల లింగయ్య, సిరిసిల్ల నర్సయ్య పాల్గొన్నారు.

# నేలపై కూర్చొని ఎంపీటీసీల నిరసన

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు



నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు స్వప్న, రాజిరెడ్డి, మల్లేశం, రవీందర్, తిరుపతి, జమున, సంధ్య

చిగురుమామిడి: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇందుర్తి ఎంపీటీసీ అందె స్వప్న రహదారి సమస్య పరిష్కారించలేదని ఆరోపిస్తూ నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేయగా మిగతా ఎంపీటీసీలు సైతం గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కాలేదని ఆమెకు సంఘీభావం తెలిపారు. గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం సభ్యులు రాకపోవడంతో గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఇందుర్తి–గాగిరెడ్డిపల్లి–సుందరగిరి వరకు బీటీరోడ్డు కోసం ఎంపీ, ప్రస్తుత కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ తన కోటా కింద రూ.15 కోట్లు మంజూరు చేశారు. గతంలో ఉన్న రోడ్డును విస్తరిస్తూ కంకరపోశారు. నాలుగు నెలలుగా కంకరరోడ్డుపై వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారని, కాంట్రాక్టర్, సంబంధితశాఖ అధికారుల స్పందన లేదని స్వప్న ఆరోపించారు. ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు వచ్చేంత వరకు లేవబోమన్నారు. మిగతా ఎంపీటీసీలు భేతి రాజిరెడ్డి (మండల పరిషత్ ఉపాధ్యక్షుడు), మిట్టపెల్లి మల్లేశం, ఏలేటి రవీందర్ రెడ్డి, మెడవేని తిరుపతి, పెసరి జమున, కొత్తూరి సంధ్య ఆమెతోపాటు నేలపై కూర్చున్నారు. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని నినాదాలు చేశారు. సభ్యులు శాంతించాలని ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి కోరారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారుల్లో జవాబుదారితనం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. కాగా ఎంపీడీఓ మధుసూదన్ ఆర్‌అండ్‌బీ ఏఈకి ఫోన్ చేయగా రహదారి ఆర్‌అండ్‌బీ శాఖకు సంబంధం లేదని నేషనల్ హైవే అథారిటీ పరిధిలో ఉందని, వారే పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

**సమస్యలు ఏకరువుపెట్టిన సభ్యులు**

జీలుగ విత్తనాల పంపిణీ సమయంలో రైతులు క్యూలో నిల్చున్న ఎస్సై రాజేశ్ రైతుల పట్ల అమానుషంగా ప్రవర్తించారని అలా ఎందుకు చేయాల్సి వచ్చిందని రామంచ ఎంపీటీసీ ఏలేటి రవీందర్ రెడ్డి, మండలపరిషత్ ఉపాధ్యక్షుడు భేతి రాజిరెడ్డి ఏఓ రంజిత్‌రెడ్డిని నిలదీశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సైకి సమాచారం ఇచ్చామని, ఒక్క చిగురుమామిడిలోనే కాకుండా మిగతా గ్రామాల్లో కూడా నకిలీ పత్తి విత్తనాలపై ఎంక్వైరీ చేశామని ఏఓ సమాధానం ఇచ్చారు. మా గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో 4 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆరోగ్య ఉపకేంద్రం పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, ఎస్సీ కాలనీలో మిషన్‌భగీరథ పథకం నీరు సరిగా రావడంలేదని బొమ్మనపల్లి ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం ఆరోపించారు. చిన్నముల్కనూర్ ఎంపీటీసీ పెసరి జమున మాట్లాడుతూ... తమ గ్రామంలో విద్యుత్ స్తంభాలు పాతినా అధికారులు కనెక్షన్ ఇవ్వడంలేదన్నారు. మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ గీకురు రవీందర్, ఎంపీడీఓ మధుసూదన్, గ్రామ ప్రత్యేకాధికారులు, వెటర్నరీ వైద్యులు శ్రీధర్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ శ్రావణ్, డిప్యూటీ తహసీల్దార్ పార్థసారథి ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### నియామకం

శంకరపట్నం: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శిగా మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన జక్కని సంజయ్‌కుమార్‌ను జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియమించారు . ఈమేరకు గురువారం నియామకపత్రం అందజేశారు. రాష్ట్రప్రధాన కార్యదర్శిగా నియమించిన కృష్ణయ్యకు సంజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

### రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు



హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో శనివారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నామని టీజీఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ సీజీఆర్‌ఎఫ్–1 చైర్ పర్సన్ తెలిపారు. ఈసందర్భంగా విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్చటం, వొల్టేజీ హెచ్చు తగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చటం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, వాడకాని కన్న హెచ్చు మొత్తంలో బిల్లులు, కేటగిరి హుజూరాబాద్, కేశవపట్నం, సైదాపూర్ మండలాలలో మార్పు, సర్వీస్ రద్దు తదితర వాటికి సంబంధించి మండలాల వారీగా రాతపూర్వకంగా ఫిర్యాదు అందించవచ్చని తెలిపారు.

## విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేత



విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ అందజేస్తున్న ఎంపీపీ రాణి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఎంపీపీ రాణీ యూనిఫామ్స్ అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని నదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాట్రపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ రావుల అనితావెంకట్ యూనిఫామ్స్‌అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అనురాధ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ వీవో రాజు, సులోచన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మూతపడిన స్కూళ్లను తెరిపించాలి



మొల్లపల్లిలో మూతపడిన పాఠశాల

జమ్మికుంట: మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామం పరిధి మొల్లపల్లి, మాచనపల్లి పరిధి ఎడ్లపల్లి, ఇల్లందకుంట మండలంలోని టేకుర్తి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు కొన్నేళ్ల క్రితం మూతపడ్డాయని, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలను డీఈవో జనార్దన్‌రావు, ఎంఈవో విడుపు శ్రీనివాస్ పట్టించుకోవడంలేదని ఇల్లందకుంటకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాంరాజయ్య గురువారం ప్రకటనలో ఆరోపించారు. పేద,బడుగు,బలహీన వర్గాల పిల్లలకు విద్య అందించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మూతపడ్డ పాఠశాలలను తెరిపించాలన్నారు. ఎంఈవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా కొన్నేళ్లుగా విద్యార్థులు ఆయా పాఠశాలల్లో చేరడం లేదని అందువల్లనే ఉపాధ్యాయులను కేటాయించలేదన్నారు. గంగ్రపల్లి గ్రామంలోని పాఠశాల విద్యార్థులను ఒడ్డెర కాలనీలోని పాఠశాలకు తరలించామన్నారు. 19 వరకు బడిబాట కార్యక్రమం ద్వారా ఆయా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నామని, స్కూళ్లను తెరిపించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు.

## ‘ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి ప్రణవ్‌కు లేదు’



మాట్లాడుతున్న కొండాల్‌రెడ్డి, నాయకులు

హుజూరాబాద్: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని విమర్శించే స్థాయి వొడితెల ప్రణవ్‌కు లేదని బీఆర్‌ఎస్ సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కనుసన్నలోనే ఫ్లైయాష్ స్కామ్ జరుగుతుందని వారం రోజులుగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధారాలతో నిరూపిస్తే ఇప్పటివరకు మంత్రి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా ఫ్లైయాష్ రామగుండం నుంచి ఖమ్మంకు తరలిస్తూ కోట్లు గడిస్తున్నారని ఇందులో కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు మంత్రికి ముడుపులు అందుతున్నాయని అన్నారు. నిబంధనలకు లోబడి యాష్ తరలిస్తే తమకి ఇబ్బంది లేదని ఎమ్మెల్యే చెప్పినప్పటికీ హుజూరాబాద్ మార్గం గుండా కాకుండా హుస్నాబాద్ నుంచి ఫ్లై యాష్ తరలించడంలో ఆంతర్యం ఏంటని, ప్రజలు ఇచ్చిన హక్కుతోనే ఎమ్మెల్యే ప్రశ్నిస్తే సరైన సమాధానాలు ఇవ్వటంలేదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గూడూరు ప్రతాప్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఇరుమళ్ల సురేందర్‌రెడ్డి, అనిల్ యాదవ్, కొండ నరేష్, మిడిదొడ్డి అశోక్, మాజీ సర్పంచులు మిడిదొడ్డి ఎల్లయ్య, కన్నబోయిన తిరుపతి, సతీష్ వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌బోర్డు పంచాయితీ వైరల్



పోలీస్ స్టేషన్ ఎదుట నిలిపిన బస్సు

చొప్పదండి: పట్టణంలో జరిగిన ఆర్టీసీ బస్సు ఫుట్‌బోర్డు పంచాయితీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చొప్పదండి ఆర్టీసీ బస్టాండ్‌కు బుధవారం మంచిర్యాల నుంచి కరీంనగర్ వెళ్లే బస్సు వచ్చింది. అప్పటికే బస్సులో జనం కిక్కిరిసిపోయారు. ఓ మహిళా ఫుట్‌బోర్డుపై నిల్చోవడంతో కండక్టర్ మహిళను బస్సులోకి రావాలని సూచించింది. ఆ మహిళా ఫుట్‌బోర్డును వదిలిపైకి రాకపోవడంతో కండక్టర్‌కు, ప్రయాణికురాలికి మాటామాటా పెరిగింది. ఇద్దరు తగ్గక పోవడంతో డ్రైవరు బస్సును చొప్పదండి పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిపాడు. పోలీసులు మహిళకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ తతంగాన్ని ఒకరు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అంతటా వైరలైంది.

## చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు

- పలువురు టీచర్లకు స్వల్ప గాయాలు



రామడుగు: ఓ ప్రైవేటు పాఠశాల బస్సు చెట్టును ఢీకొన్న ఘటనలో పలువురు టీచర్లకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని గోపాల్‌రావుపేట, వెదిర అల్ఫోర్స్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు స్కూల్ బస్సులో గురువారం సాయంత్రం కరీంనగర్ వెళ్తున్నారు. దేశరాజ్‌పల్లి శివారులో బస్సు అదుపుతప్పడంతో చెట్టును ఢీకొట్టింది. ఉపాధ్యాయులు స్వల్పంగా గాయపడగా పెను ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

### హోంశాఖ సహాయమంత్రికి శుభాకాంక్షలు



చొప్పదండి: సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న బీజేపీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

చొప్పదండి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ గురువారం మంత్రి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వరుసగా రెండోసారి ఎంపీగా గెలుపొంది కేంద్ర సర్కార్‌లో కరీంనగర్ జిల్లా నుంచి హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం జిల్లా వాసులు గర్వించదగ్గ సమయమని హర్షం వ్యక్తం చేశారు. బండి సంజయ్‌కు భారీ మెజారిటీ ఇచ్చిన చొప్పదండి నియోజకవర్గంలోని ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

రామడుగు: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను బీజేపీ మండల నాయకుడు జిన్నారం విద్యాసాగర్, పలువురు నాయకులు కలిశారు. ఈసందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

చిగురుమామిడి: మండలంలోని ఓగులాపూర్ గ్రామం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా పలువురు నాయకులతో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



చిగురుమామిడి: బండి సంజయ్‌ని సన్మానిస్తున్న కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

### గంగిపల్లిలో పిడుగుపాటుతో ఆవు మృతి



మానకొండూర్: మండలంలోని గంగిపల్లిలో బండి అశోక్‌కు చెందిన పాడి ఆవు పిడుగుపాటుతో మృతి చెందింది. గురువారం సాయంత్రం వర్షం కురవడంతోపాటు వ్యవసాయ పొలం వద్ద ఉన్న ఆవుపై పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.40 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతు వాపోయాడు.

### అర్జీ ఇచ్చేందుకు వెళ్లి.. సొమ్మసిల్లి పడిపోయిన కేశవపట్నంవాసి

శంకరపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజాపాలన దరఖాస్తు అందించేందుకు వచ్చిన ఓ వ్యక్తి సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికుల వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి చెందిన సదానందం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం అర్జీ ఇచ్చేందుకు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చాడు. అప్పటికే చాలామంది క్యూలో ఉన్నారు. అతను కూడా క్యూలో నిల్చొని, కొద్దిసేపటికి కిందపడ్డాడు. వెంటనే అక్కడున్నవారు సదానందంను ఫ్యాన్ కింద కూర్చోబెట్టడంతో స్పృహలోకి వచ్చాడు. తర్వాత అతన్ని వాహనంలో ఇంటికి పంపించారు.

## ‘నీట్’ పరీక్ష రద్దు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

జమ్మికుంట: నీట్ పరీక్ష రద్దు చేయాలని యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ సజ్జద్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు వాసాల సుధీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వేజ్ మహమ్మద్ ఆధ్వర్యంలో ఫ్లైవోవర్ వద్ద గురువారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. పరీక్షలో అవకతవకలు జరిగాయని, పేద విద్యార్థులు ఎంబీబీఎస్‌కు దూరమవుతారని, 14న విడుదల చేయాల్సిన పరీక్ష ఫలితాలను పది రోజుల ముందుగానే విడుదల చేశారని ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని పరీక్షను రద్దుచేయాలన్నారు. కార్యక్రమంలో చాంద్ పాషా, ఫయాజ్, అనిల్, సురేష్, వేణు, శశి,సాయి తదితరులు పాల్గొన్నారు.

## చెరువు కట్టకు మరమ్మతు చేయండి

**ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమైన కట్ట**



పాక్షికంగా ధ్వంసమైన చెరువు కట్ట

వీణవంక: మండలంలోని కొండపాక గ్రామ శివారులోని నల్లకుంట చెరువు కట్ట ఇటీవల కురిసన వర్షాలకు ధ్వంసమైంది. చెరువు కింద 50 ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు 60 మంది చిన్న, సన్నకారు రైతులకు భూములున్నాయి. కట్ట ఎత్తు తక్కువగా ఉందని, భారీ వర్షాలు కురిస్తే కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. దీనివల్ల నీటి ఎద్దడి ఏర్పడి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని, సంబంధిత అధికారులు పరిశీలించి కట్ట మరమ్మతు చేయించాలని రైతులు కోరుతున్నారు.

### మంత్రికి సమస్యలు విన్నపం



మంత్రి పొన్నంతో మాట్లాడుతున్న మల్లారెడ్డి

చిగురుమామిడి: కాంగ్రెస్‌పార్టీ చిగురుమామిడి మండల నాయకుడు పోటు మల్లారెడ్డి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశా రు. పలు సమస్యలను మంత్రికి విన్నవించారు. రుణమాఫీ, ఇదే నెలలో రైతులకు పెట్టుబడి సాయం అందేలా చూడాలని కోరారు. వెంట మాజీ కార్పొరేటర్ బుర్ర రాజమౌళి ఉన్నారు.



### వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట

వీణవంక: కార్తెలు అన్ని కరిగిపోతున్నా వరుణుడు కరుణించడంలేదు. విత్తనాలు విత్తిన రైతులు చేలను చెడగొట్టి మళ్లీ విత్తనాలు విత్తుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో వర్షాలు కురవాలని గ్రామస్తులు కప్పతల్లి ఆడారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు పడక విత్తనాలు దుక్కిలోనే మాడిపోతున్నాయని వాపోయారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని వరుణుడిని వేడుకున్నారు.

### నేడు మండల సభ

రామడుగు: రామడుగు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నామని ఎంపీడీవో రాజేశ్వరీ తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.